ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు

- మండలంలో 4 పల్లె దవాఖానాలు
- సిబ్బంది కొరత, ముగ్గురే ఏఎన్ఎంలు
- పేదలకు అందని ప్రభుత్వ వైద్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పల్లె దవాఖానల నిర్వహణ గాలికి వదిలేసినట్లు ఉంది. మండలంలో ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం లేకపోగా ఉన్న పల్లె దవాఖాన(ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం)లో సిబ్బంది కొరత ఉంది. ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుతున్న పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిబ్బంది లేకపోవడంతో పేదలకు వైద్యం అందని ద్రాక్షలా మారింది. పాలకులు సమస్యపై దృష్టి సారించక పోవడంతో ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన ఆరోగ్య ఆసుపత్రి మంజూరైన స్థలం గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.



గన్నేరువరంలోని పల్లె దవాఖాన

గన్నేరువరం: మండలంలో ప్రస్తుతం 25 వేల వరకు జనాభా ఉంది. జనాభా అనుగుణంగా ప్రభుత్వ ఆరోగ్యం కేంద్రంతో పాటు ఐదువేల మందికి ఒక పల్లె దవాఖాన చొప్పున ఐదు ఆరోగ్య ఉపకేంద్రాలు ఉండాలి. కానీ కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. అంతేకాకుండా ముగ్గురు ఏఎన్ఎంలు మాత్రమే ఉన్నారు. అవుట్ సోర్సింగ్‌లో ఇద్దరు డాక్టర్లు జంగపల్లి, గన్నేరువరం పల్లె దవాఖానాల్లో విధులు నిర్వహిస్తున్నారు. గునుకులకొండాపూర్ పల్లె దవాఖానలోని మొదటి ఏఎన్ఎం రాధ నాలుగేళ్ల క్రితం ప్రమోషన్‌పై వెళ్లింది. ఇటీవల సెకండ్ ఏఎన్ఎం సుజాత నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అలాగే ఖాసీంపేట పల్లె దవాఖానలో మొదటి ఏఎన్ఎం అనిత ప్రమోషపై వెళ్లగా, సెకండ్ ఏఎన్ఎంగా భూలక్ష్మీ విధులు నిర్వహిస్తోంది. గునుకులకొండాపూర్ పల్లె దవాఖాన ఇన్‌చార్జి బాధ్యతలను భూలక్ష్మీకి అప్పగించడంతో రెండు పల్లె దవాఖానల్లోని ఆరు గ్రామాల బాధ్యతలను చూడాల్సి వస్తోంది. జంగపల్లి పల్లె దవాఖాన మొదటి ఏఎన్ఎం సుజాత మూడేళ్ల క్రితం బదిలీపై వెళ్లిపోగా రెండో ఏఎన్ఎం మంజుల విధులు నిర్వహిస్తున్నారు. ఇకా మండల కేంద్రం గన్నేరువరం పల్లె దవాఖానలో మొదటి ఏఎన్ఎం రాధ ఒక్కరే విధులు నిర్వహిస్తున్నారు. రెండో ఏఎన్ఎం ఎల్లవ్వ గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇటీవల మృతి చెందారు. దీంతో విధుల నిర్వహణ ముగ్గురిపై భారంగా మారింది. మరోవైపు పేదలకు సరియైన వైద్య సదుపాయం కానరావడం లేదు. అలాగే ఏడాది క్రితం ఇద్దరు హెల్త్ అసిస్టెంట్లను బదిలీ చేయడంతో ప్రభుత్వ ఆరోగ్య వైద్య సేవలు అగమ్యగోచరంగా మారాయి.

జ్వరం వస్తే ఆర్ఎంపీలే దిక్కు

గన్నేరువరం, ఖాసీంపేట, జంగపల్లి, గునుకులకొండపూర్ గ్రామాల్లో పల్లె దవాఖానలు ఉన్నాయి. దగ్గు, జ్వరానికి మందులు మాత్రమే అందుబాటులో ఉంటాయి. ప్రధాన ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో జ్వరాలు, వాంతులు, విరేచనాలు, పాము, తేలు, కోతులు దాడులు చేస్తే చికిత్స కోసం ప్రైవేట్ ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. చిన్న చిన్న గాయాలు, తీవ్రమైన జ్వరం వస్తే గ్రామాల్లోని ఆర్ఎంపీలకు వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలవారు జబ్బులు బారినపడితే ఎంతో కొంత సంపాదించిన డబ్బులు ప్రైవేటు ఆసుపత్రులు, ఆర్ఎంపీలకు దారపోయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లిష్ట సమయంలో టెస్టుల కోసం జిల్లా కేంద్రానికి ప్రజలు పరుగులు తీస్తున్నారు.

సిబ్బందిని నియమించాలి



ప్రజలకు ప్రభుత్వ ఆరోగ్య వైద్య సేవలు అందడం లేదు. ప్రధాన ఆసుపత్రి లేకపోవడం ,పల్లె దవాఖానల్లో 3 ఏఎన్ఎంలు ఉన్నారు. హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం బదిలీ చేసినా కొత్త వారిని నియమించలేదు. విషజ్వరాలు వస్తే ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరాల్సిందే సంపాధించిన డబ్బు వైద్యానికే ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఆసుపత్రుల్లో సిబ్బందిని నియమించాలి.

– బామండ్ల రవీందర్, చీమలకుంటపల్లి

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ

తిమ్మాపూర్: ఎమ్మార్పీఎస్ మండల కమిటీని బుధవారం మండలంలోని వచ్చునూర్ లో జిల్లా ఉపాధ్యక్షుడు కనకం అంజిబాబు మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జి తుంగ అంజనేయులు మాదిగ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వచ్చునూర్ గ్రామానికి చెందిన ఉప్పులేటి మధు మాదిగ, ఉపాధ్యక్షుడిగా బి. సంపత్‌కుమార్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా మాతంగి రమేశ్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు అంజిబాబు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చేరువలో ఉన్నామని, మాదిగల అంతిమ లక్ష్యాన్ని త్వరలో చేరుకుంటామన్నారు. 8న కరీంనగర్ టీఎన్‌జీవో భవన్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి మంద కృష్ణ మాదిగ వస్తున్నారని, సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలోనాయకులు సిరిసిల్ల నర్సయ్య, ఎలుకపెల్లి స్వామి, ఉప్పులేటి శ్రీనివాస్,ఉప్పులేటి జీవన్,గోపయ్య, కవ్వంపల్లి రాకేశ్ పాల్గొన్నారు.

నియామకం



ఉత్తర్వులు అందుకుంటున్న మహేందర్‌గౌడ్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ కు చెందిన నేరెళ్ల మహేందర్‌గౌడ్ తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియామకమయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరిగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తీగల భరత్‌గౌడ్ బుధవారం నియామక ఉత్తర్వులు అందజేశారు.

క్లుప్తంగా

హైమాస్ట్‌లైట్లు ప్రారంభం



లైట్లను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శ్రీరామ్‌శ్యామ్

జమ్మికుంట: జిల్లా పరిషత్ నిధులతో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని జెడ్పీటీసీ డాక్టర్ శ్రీరామ్‌శ్యామ్ అన్నారు. మండలంలోని శాయంపేటలో బుధవారం హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. వావిలాల, పెద్దంపల్లి, జగ్గయ్యపల్లి, పాపక్కపల్లి, శంభునిపల్లి, తనుగుల, నాగంపేట, కోరపల్లి, వెంకటేశ్వరపల్లి గ్రామాల్లో జెడ్పీ నిధుల నుంచి ప్రతి గ్రామానికి రూ.లక్ష చొప్పున కేటాయించి, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో శాయంపేట మాజీ సర్పంచ్ అకినపల్లి సుజాత భద్రయ్య, మాజీఉప సర్పంచ్ లింగంపల్లి రవీందర్‌రావు, నాయకులు దేవేందర్ రావు, యామ రవీందర్, సుంకరి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషన్, కారోబార్ స్వామి, రాజు, అరవింద్, క్రాంతి, శివ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న వొడితెల ప్రణవ్

ఇల్లందకుంట: కాంగ్రెస్‌లో చేరినవారికి అండగా ఉంటామని, ప్రతి కార్యకర్త పార్టీ కుటుంబ సభ్యుడేనని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలోని భోగంపాడు ఎంపీటీసీ ఎక్కటి సంజీవరెడ్డి, మండల కో ఆప్షన్‌సభ్యుడు లాల్ మహ్మద్, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు మహిపాల్‌యాదవ్, మాజీ ఉపసర్పంచ్ పుట్ట స్వరూపసదయ్య, మైనార్టీ నాయకులు రఫీఖాన్, ఇల్లందకుంట వార్డు సభ్యులు రావుల రాజబాబు, రేణిగుంట్ల రవీందర్, రావుల ఎల్లయ్యతో పాటు దాదాపు 200 మంది కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలకంటే హుజూరాబాద్ నియోజకవర్గంలోనే లక్ష ఓట్ల మెజార్టీ వచ్చేలా ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, రామకృష్ణ, కసుమల్ల రామకృష్ణ, సారంగపాణి, మహేశ్, ప్రవీణ్, తిరుపతి, సంపత్, కుమార్, రవి, పరమేశ్, కిరణ్, రమేశ్, వేణు, దేవేందర్, వంశీ, శివ పాల్గొన్నారు.


సదుపాయాలు కల్పించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

హుజూరాబాద్: రంజాన్ పురస్కరించుకొని మసీదుల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు ముస్లింలు వినతిపత్రం సమర్పించారు. ఆరు మసీదుల వద్ద ప్రత్యేక శానిటేషన్, విద్యుత్, తాగునీటి వసతులు కల్పించాలని, ఖబ్రస్థాన్‌లు శుభ్రం చేయించాలని కోరారు. రంజాన్ మాసంలో ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మానకొండూర్: మండలంలోని అన్నారం, రంగపేట గ్రామాల్లో వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా బుధవారం మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... యువత మంచి కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని, వలంటీర్లు లక్ష్యంతో పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రొఫెసర్లు చైతన్య, సతీశ్, వేణు, చారి, శిరీషా, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీరందించాలి

వీణవంక: చివరి ఆయకట్టుకు ఎస్సారెస్పీ నీటిని అందించాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. డీబీఎం 15కెనాల్ ద్వారా బేతిగల్, కనపర్తి, వల్భాపూర్, నర్సింగాపూర్ మీదుగా జమ్మికుంట మండలం కాపులపల్లి, కోరపల్లి వరకు నీటి పారకం ఉంది. కానీ వల్భాపూర్, నర్సింగాపూర్ గ్రామాల వరకు పూర్తి స్థాయిలో నీరు అందడం లేదని, పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. వరి పత్తి, మొక్కజొన్న పంటలకు ఇప్పుడు నీరందించడం కీలకమని, మొదట ఉన్న పొలాలకు మాత్రమే నీరు అందుతుందని, చివరి వరకు అందడం లేదని, ఇప్పటికైనా అధి కారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

ఆలయ భూములను రక్షించుకోవాలి

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ
- నల్లగొండ ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం
- నూతన చైర్మన్‌గా బండారిపల్లి లక్ష్మణ్



చైర్మన్ లక్ష్మణ్, డైరెక్టర్లతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ బండారిపల్లి లక్ష్మణ్

తిమ్మాపూర్: ఆలయ భూములను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీసీతారామ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం బుధవారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బండారిపల్లి లక్ష్మణ్, డైరెక్టర్లు గాజుల అంజయ్య, భూత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మీరాజం, జినుక శ్రీనివాస్, కవ్వంపల్లి మహేశ్, గోలి లక్ష్మి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఆలయ భూములు కబ్జాకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నూతన చైర్మన్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సామాన్యుడికి సైతం పదవులు లభిస్తాయని అన్నారు. గ్రామంలో ఆర్ఎంపీగా పనిచేస్తూ పేదలకు సేవలు అందిస్తున్న తనను నల్లగొండ ఆలయ చైర్మన్‌గా నియమించడం అదృష్టంగా భావిస్తున్నాను అని, నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఉడితల వెంకన్న, గ్రామశాఖ అధ్యక్షుడు మార్క నర్సయ్య, మండల అధ్యక్షుడు నాయకులు దన్నమనేని సురేందర్ రావు, మాజీ చైర్మన్ శ్రీనివాస్ రావు, ఎంపీటీసీ బండారి రమేశ్, నాయకులు ఎస్ఎల్ గౌడ్, కొండయ్య, సంపత్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న జడ్జీలు అలేఖ్య, పద్మసాయి

హుజూరాబాద్: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి పి. అలేఖ్య, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పద్మసాయి అన్నారు. పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జీలు మహిళల చట్టాలు, హక్కులు, చదువు, అభివృద్ధి తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భగవాన్‌రెడ్డి, లోక్ అదాలత్ మెంబర్ సమ్మయ్య, న్యాయవాదులు విజయరెడ్డి, భానుకిరణ్, మాదవి, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కొత్త వినీత

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలంలోని పీచుపల్లి, చిగురుమామిడి, బొమ్మనపల్లి గ్రామాల్లో రూ.48 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను బుధవారం ఎంపీపీ కొత్త వినీత ప్రారంభించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. వెంట పంచాయతీరాజ్ డీఈ రవిప్రసాద్, ఎంపీడీవో బాసం మధుసూదన్, ఎంపీటీసిలు పెసరి జమున, మిట్టపల్లి మల్లేశం గ్రామ ప్రత్యేక అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌సాయి, పంచాయతీ కార్యదర్శులు ఉమారాణి, వెంకటరమణ, రమణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కుమార్, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలించిన ఎన్ఆర్ఎస్ శాస్త్రవేత్తలు

సైదాపూర్: మండలంలోని గొడిశాలలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన వివిధ పనులను బుధవారం నేషనల్ రిమోట్ సెన్సింగ్(ఎన్ఆర్ఎస్)శాస్త్రవేత్తలు జ్యోషి, అనిల్‌కుమార్ పరిశీలించారు. పాంపాండ్స్, భూగర్భ జలాల పెంపు, ఫీడర్ చానల్స్, వ్యవసాయసాగు పెరుగుదల, హరితహారం, హార్టికల్చర్, పండ్లతోటలు, నర్సరీ, పల్లె ప్రకృతి వనాలు, తదితర పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌డీ ప్రతినిధులు అభయ్‌కుమార్, ఎంపీడీవో యాదగిరి, ఏపీవో రాణీ, ఈజీఎస్ సిబ్బంది ఉన్నారు.

సమీక్షా సమావేశం

సైదాపూర్: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ చేపట్టి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని డీపీవో రవీందర్ మండల అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. మిషన్‌భగీరథ, తాగునీటి పైపులైన్‌ల లీకేజీలకు మరమ్మతు చేయించాలన్నారు. ఎంపీడీవో యాదగిరి, తహసీల్దార్ మంజుల, ఎంపీవో సురేందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జమ్మికుంట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వరగంటి రవి బుధవారం తెలిపారు. మానేరు పరివాహక ప్రాంతం వావిలాల వాగు నుంచి అదే గ్రామానికి చెందిన ఇద్దరు రెండు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకొని ట్రాక్టర్లను సీజ్ చేశామన్నారు.

బండి సంజయ్‌కు ఘన స్వాగతం



సంజయ్‌కు స్వాగతం పలుకుతున్న యువతి

మానకొండూర్: ప్రజాహిత యాత్రలో భాగంగా మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో ఎంపీ బండి సంజయ్ బుధవారం సాయంత్రం పర్యటించారు. ఈసందర్భంగా గ్రామస్తులు సంజయ్‌కు ఘన స్వాగతం పలికారు.

నేడు బండి సంజయ్ ప్రజాహిత యాత్ర

చొప్పదండి: మండలంలో గురువారం ఎంపీ బండి సంజయ్ నిర్వహించే ప్రజాహిత యాత్రను ప్రజలు విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం తొమ్మిది గంటలకు మండల పరిధిలోని రుక్మాపూర్‌లో మొదలై కాట్నపల్లి, సాంబయ్యపల్లి, గుమ్లాపూర్ మీదుగా చొప్పదండి పట్టణానికి యాత్ర చేరుకుంటుందని, అనంతరం ఆర్నకొండ, రెవెల్లి వరకు యాత్ర కొనసాగుతుందని తెలిపారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు.

బహిరంగసభ విజయవంతం చేయండి

చొప్పదండి: కరీంనగర్‌లో ఈ నెల 12న జరిగే కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ స్థాయి బహిరంగ సభకు అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, సాంబయ్య, లోక రాజేశ్వర్‌రెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులకు పీఏసీఎస్ వైస్ చైర్మన్ ముద్దం మహేశ్‌గౌడ్ పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుర్రం భూమారెడ్డి, రెహమాన్ పాషా, బైరగోని ఆనంద్‌గౌడ్, పిట్టల వెంకటేశ్, ఎలిగేటి సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వతి పరమేశ్వరుడి కల్యాణం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీమహాదేవ లింగేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు ఫణిశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం జరిపించారు. ఉదయం నిత్యపూజ, మండప పూజ, తదితర కార్యక్రమాలు కొనసాగాయి. మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకొని కల్యాణం వీక్షించారు. అనంతరం మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తులను రథంపై పుర వీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దయ్యాల శ్రీనివాస్, పంజాల అనిల్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని బేతిగల్‌లో శ్రీకాత్యాయని మృత్యుంజయస్వామి ఆలయంలో శివకల్యాణం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగింది. అనంతరం మహాఅన్నదానం కార్యక్రమం చేపట్టారు.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

మండలంలోని కనపర్తి గ్రామంలోని అతిపురాతన శివాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునరుద్ధరణ పనుల కోసం దాతలు ముందుకు వస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వహణ ఖర్చుల కోసం గ్రామానికి చెందిన మహాకాళ సాంబశివారెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి ఒక్కొక్కరు రూ.రెండ లక్షల చొప్పున విరాళం అందించారు. ప్రముఖ వేద పండితుడు గూడ జగదీశ్వరశర్మ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని గ్రామస్తులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌పై బీఆర్ఎస్ నాయకుల నిరసన

మానకొండూర్: ఎన్నికలకు ముందు ఎల్ఆర్ఎస్‌కు ఎలాంటి ఫీజులు వసూలు చేయమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట తప్పిందని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌పై చేపట్టిన నిరసనలో భాగంగా మండల కేంద్రంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా జీవీఆర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే రూ. మూడువేల కోట్లు దండుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు.మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, జడ్పీటీసీలు శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్: ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఆర్డీవో కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి, నాయకులు ఐలయ్య, శ్రీనివాస్, నాయకులు తదితరులు ఉన్నారు.

చొప్పదండి: కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్ఆర్ఎస్ ఫ్రీగా చేయాలని డిమాండ్ చేసి అధికారంలోకి రాగానే ఫీజు వసూలు చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ కేంద్రం చొప్పదండిలో బుధవారం ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధర్నాలో పాల్గొని మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ ఉచి తంగా చేయకుండా పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ధర్నాలో ఎంపీపీ చిలుక రవీందర్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఏనుగు రవీందర్ రెడ్డి, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, లోక రాజేశ్వర్‌రెడ్డి, గడ్డం చుక్కరెడ్డి, చీకట్ల రాజశేఖర్, కొత్త గంగారెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి: ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు క్రీడాపోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం క్రీడా సాంస్కృతిక దినోత్సవాలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతుల ప్రదానం చేశామన్నారు. విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా స్కిల్స్ పెంపొందించుకుంటూ ముందుకుసాగాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహమూర్తి, కల్చరల్ కోఆర్డినేటర్ ఎస్.మధు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ పి.దినకర్, అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీని సందర్శించిన విద్యార్థులు



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామం వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం హన్మకొండ జిల్లాలోని కాకతీయ మెడికల్ కాలేజీని సందర్శించారని ప్రిన్సిపాల్ వీవీఎస్ హనుమకుమార్ తెలిపారు. కాలేజీలోని మార్చురీ, బాటనీ, జంతుశాస్త్ర డిపార్ట్‌మెంట్లు, ల్యాబ్‌లను విద్యార్థులు పరిశీలించారని పేర్కొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నం. : 1800 425 9899